సాక్షి విశాఖపట్నం

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



క్యాన్సర్‌పై ఆందోళన వద్దు

క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సాగరతీరంలో వాక్‌థాన్ నిర్వహించారు. 8లో



సాహిత్యంలో పట్టుతోనే చట్టంపై అవగాహన 8లో

చట్టంలోని మెళకువలు తెలుసుకోవాలని కేరళ మాజీ ప్రధాన న్యాయమూర్తి బన్నూరుమత్ అన్నారు.



విశాఖ సాగరంతో విశ్వనాథ సంగమం 8లో

కళాతపస్వి కె.విశ్వనాథ్ జ్ఞాపకాలు విశాఖ ప్రజల మదిలో ఎప్పటికీ నిలిచేఉంటాయి.

న్యూస్‌రీల్

ఢిల్లీ, ముంబైలకు ఎయిర్ ఇండియా సర్వీసులు

13 నుంచి ప్రారంభం



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నుంచి మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్ ఇండియా సంస్థ ఈనెల 13 నుంచి ప్రతిరోజూ ఢిల్లీ, ముంబైలకు వీటిని నడపనుంది. ముంబై–విశాఖ విమాన సర్వీసు ముంబైలో మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి సాయంత్రం నాలుగు గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ విమానం సాయంత్రం 4.40 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 6.45 గంటలకు ముంబై వెళ్తుంది. అలాగే ఢిల్లీ–వైజాగ్ సర్వీసు ఢిల్లీలో సాయంత్రం 6.10కు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు విశాఖకు వస్తుంది. ఇదే విమానం రాత్రి 9.10కి విశాఖలో బయలుదేరి 11.20కి ఢిల్లీకి చేరుకుంటుంది.

నేడు వాసిరెడ్డి పద్మ రాక

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ శనివారం విశాఖ వస్తున్నారు. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం పది గంటలకు విశాఖ చేరుకుంటారు. రుషికొండ రాడిసన్ హోటల్ జరిగే సదస్సులో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్డు మార్గం ద్వారా గన్నవరం వెళతారు.

ఆర్ఐవోగా ఉమారాణి



విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా పోసుపు ఉమారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఉమారాణికి ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్ఐవోగా వ్యవహరిస్తున్న ఆర్. సత్యనారాయణ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఉమారాణికి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

సీతంపేట (విశాఖ ఉత్తర): భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నుంచి పదో తేదీ వరకు లంకపల్లి బుల్లయ్య కళాశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు, రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ లీడర్ల శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్టు మేజర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ గైడ్ యూనిట్లు ప్రారంభించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు స్కౌట్ మాస్టర్లకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. రాష్ట్ర శిక్షణాధికారులుగా బి. ఉమాదేవి పర్యవేక్షణలో పి.సుశీల, డి.వేణుగోపాల్ వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 99081 86967 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దక్షిణ భారత హిందీ పరీక్షల హాల్ టిక్కెట్ల జారీ 5న

తగరపువలస (భీమిలి): ఈ నెల 11, 12 తేదీలలో జరగనున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై పరీక్షలకు భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా హాజరయ్యేవారికి 5న హాల్‌టిక్కెట్లు జారీ చేయనున్నట్టు ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. అలాగే లోయర్ పరీక్షలకు సంబంధించి అదే రోజు ప్రీ ప్రైమరీ పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 13 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. వైద్య ఆరోగ్యశాఖ, ఏపీ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. క్యాథ్–ల్యాబ్ టెక్నీషియన్(2), ఆప్తాల్మిక్ అసిస్టెంట్(2), ప్లంబర్(1), ఆడియోమెట్రీ మెషిన్ కాంట్రాక్ట్(1), రేడియోగ్రాఫర్(2), స్పీచ్ థెరపిస్ట్(3), ఎలక్ట్రికల్ డెంటల్ టెక్నీషియన్(1), ఫార్మాసిస్ట్(1) పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు, విద్యార్హత ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలి. https://visakhapatnam.ap.gov.in/ను సందర్శించి దరఖాస్తుతో పాటు మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

రాషా లీలలు

- చెత్త తరలింపులో 'రాషా ఇన్ఫ్రా' అదే నిర్లక్ష్యం
- యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- జీవీఎంసీ నిధులతో తరలించేందుకు సమాయత్తం
- ఆలస్యానికి పెనాల్టీ విధించే అవకాశం ఉన్నా... కిమ్మనని అధికారులు



మూలకు చేరిన వాహనాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అత్త సొమ్ము అల్లుడి దానం అన్న చందంగా మారింది గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో అధికారుల తీరు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను ఇష్టరీతిన కాంట్రాక్టు సంస్థకు మేలు చేకూరుస్తున్నారు. కాంట్రాక్ట్ సంస్థ చేయాల్సిన పనులను కూడా జీవీఎంసీ నిధులతో చేసేందుకు సిద్ధపడుతుండడం విమర్శలకు తావిస్తోంది. చెత్త తరలింపులో పదే పదే నిర్లక్ష్యం వహిస్తున్న 'రాషా ఇన్ఫ్రాస్ట్రక్చర్'పై జీవీఎంసీ చర్యలు తీసుకోకుండా వెనకేసుకొస్తుండటం గమనార్హం. సకాలంలో చెత్తను తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు సంస్థకు అపరాధ రుసుం (పెనాల్టీ) విధించడంతో పాటు నేరుగా బ్లాక్ లిస్టులో పెట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు తాత్సారం చేస్తున్నారన్న అపవాదు ఉంది.

జీవీఎంసీ పరిధిలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను టౌన్ కొత్త రోడ్డు, గాజువాకలోని చెత్త తరలింపు కేంద్రాల (ట్రాన్సిస్ట్ సెంటర్స్)కు తరలిస్తారు. ఇక్కడి నుంచి ఎప్పటికప్పుడు చెత్తను కాపులుప్పాడకు తరలించాల్సి ఉంటుంది. అయితే రాషా ఇన్ఫ్రా కాంట్రాక్టు సంస్థ మాత్రం నిర్లక్ష్యం చూపుతోంది. ఒక ట్రిప్పులో 15 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించాల్సి ఉంది. ఒక్కో ట్రిప్పులో కేవలం 10–11 ఎంటీల చెత్తను మాత్రమే తరలిస్తోంది. అదేవిధంగా రోజుకు 15 ట్రిప్పులు తిరగాల్సి ఉన్నప్పటికీ 5–6 ట్రిప్పులకే సరిపెడుతోంది. దీంతో ఇక్కడ కాస్తా చెత్త పేరుకుపోతోంది. ఈ విధంగా పేరుకుపోయిన చెత్తను ఇప్పుడు జీవీఎంసీ సొంత నిధులతో తరలించి.. యార్డును శుభ్రం చేసి రాషాకు మేలు చేకూర్చేందుకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవానికి ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను టౌన్ కొత్త రోడ్డు, గాజువాకలోని చెత్త తరలింపు కేంద్రాలకు చేరుస్తారు. అక్కడి నుంచి కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకోసం రాషా ఇన్ఫ్రా అనే సంస్థకు కాంట్రాక్టు అప్పగించారు. ఈ ఒప్పందం మేరకు రోజూ 15 టన్నుల చెత్తను 5 హుక్ లోడర్స్ ద్వారా తరలించాలి. అంతేకాకుండా ట్రాన్సిట్ పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు చెత్త పేరుకుపోకుండా క్లీన్‌గా ఉంచాలన్నది ఒప్పందం. ఇందుకు భిన్నంగా ట్రాన్సిట్ పాయింట్ల వద్ద చెత్త పేరుకుపోతోంది. అటు గాజువాక, ఇటు టౌన్ కొత్త రోడ్డులోని పాయింట్ల వద్ద 200 టన్నుల నుంచి 300 టన్నుల వరకూ చెత్త పేరుకుపోతోంది. దీంతో చుట్టుపక్కల దుర్గంధం వెదజల్లడంతో పాటు అనారోగ్యానికి కూడా గురయ్యే పరిస్థితులుంటున్నాయి. రాషా సంస్థకు చెందిన 5 వాహనాల్లో 3 వాహనాలు మూలకు చేరాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాషా సంస్థ చేయాల్సిన పనిని జీవీఎంసీ సొంత నిధులతో ప్రైవేటు వాహనాలతో తరలించి శుభ్రం చేసేందుకు సమాయత్తమైనట్టు తెలుస్తోంది. ఇందుకోసం లక్షల్లో నిధులు ఖర్చు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. వాస్తవానికి గతంలో కూడా ఇదే తరహాలో చెత్త పేరుకుపోవడంతో జీవీఎంసీ నిధులతోనే చెత్తను తరలించి శుభ్రంగా ఉంచారు. అయితే భవిష్యత్‌లో మరోసారి చెత్త పేరుకుపోతే, అదనపు సొమ్ము చెల్లించి వేరే ప్రైవేటు సంస్థ ద్వారా చేయిస్తే... ఆ మొత్తం భారాన్ని కూడా రాషా ఇన్ఫ్రాపైనే మోపాలని కూడా జీవీఎంసీ నిర్ణయించింది. అయినప్పటికీ మరోసారి కూడా జీవీఎంసీ నిధులనే వెచ్చించి రాషా సంస్థకు మేలు చేకూర్చేలా అధికారులు పావులు కదుపుతుండటం గమనార్హం.

ఇదేం నిర్వహణ...



చెత్త తరలింపు కేంద్రాల నుంచి చెత్తను తరలించే వాహనాల నిర్వహణ విషయంలో కూడా రాషా ఇన్ఫ్రా సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత కొన్ని నెలలుగా క్లోజ్డ్ కాంపాక్టు వాహనాల టైర్లను సంస్థ మార్చడం లేదు. దీంతో టైర్లు బాగా దెబ్బతిన్నాయి. పదే పదే పంక్చర్లు అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో ట్రిప్పుల సంఖ్య తగ్గి చెత్త పేరుకుపోయేందుకు కారణమవుతోంది. అంతేకాకుండా వాహనాల నిర్వహణ కూడా సరిగ్గా లేకపోవడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి.

ఈ విధంగా గత 10 రోజులుగా 5 వాహనాల్లో మూడు వాహనాలు మూలకు చేరినప్పటికీ సదరు సంస్థ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక చెత్త తరలింపు వాహనం వెళుతున్న సమయంలో రోడ్డుపై చెత్త పడుతోంది. ఫలితంగా నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై గతంలో జీవీఎంసీ కమిషనర్ హెచ్చరించారుకూడా... అంతే కాకుండా ఇదే పరిస్థితులు పునరావృతమైతే ఏకంగా బ్లాక్ లిస్టులో పెడతానని హుకుం జారీ చేశారు. అయినప్పటికీ రాషా సంస్థ అదే నిర్లక్ష్యాన్ని కనబరుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు

- బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయింపు
- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి వెల్లడి



బడ్జెట్ వివరాలు తెలియజేస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేకు అగ్రస్థానం లభించింది. వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు చేశారని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా రాష్ట్రాలకు కేటాయించిన కేటాయింపుల వివరాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2800 కోట్లు కంటే ఎక్కువ వాల్తేర్ డివిజన్‌కు కేటాయించారని, ఇది కాకుండా సంయుక్త పనుల నిమిత్తం ఈస్ట్‌కోస్ట్‌రైల్వేకు మరో రూ.1,700 కోట్లు కేటాయించినట్లు డీఆర్‌ఎం తెలిపారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో ఆయా పనులకు 2023–24 బడ్జెట్ కేటాయింపులు

- వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న కొత్త లైన్లకు రూ. 285కోట్లు కేటాయించారు. వీటిలో ముఖ్యంగా జైపూర్–మల్కన్‌గిరి, జైపూర్–నవరగంపూర్, నౌపడ- గుణుపూర్ బ్రాడ్‌గేజ్ లైన్లు ఉన్నాయి.
- డబ్లింగ్ (రెండో లైన్) పనులకు రూ.2,185 కోట్లు కేటాయించారు.
- కిరండూల్–జగదల్‌పూర్‌కు రూ.135 కోట్లు
- జగదల్‌పూర్ –కోరాపుట్‌కు రూ.170 కోట్లు
- విజయనగరం–సంబల్‌పూర్ మూడోలైన్‌కు రూ.920కోట్లు
- కొత్తవలస–కోరాపుట్‌కు రూ.410 కోట్లు,
- కోరాపుట్ – సింగపూర్ రోడ్ రూ. 550 కోట్లు

ట్రాఫిక్ సదుపాయాలు

- డివిజన్ పరిధిలో గల ట్రాఫిక్ సదుపాయాలైన యార్డ్ మోడలింగ్, ఇతర పనులకు కింద విధంగా కేటాయింపుల చేశారు. దీనికి గాను రూ.51.13 కోట్లు కేటాయించారు. రహదారి భద్రతా విభాగాలకు గాను లెవెల్ క్రాసింగ్స్‌కు, రోడ్ అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలకు గాను సుమారు రూ.17.45 కోట్లు, ట్రాక్ రెన్యూవల్స్‌కు రూ.261కోట్లు, బ్రిడ్జి పనులకు రూ.9.93కోట్లు, సిగ్నల్ అండ్ టెలికంకు రూ.30.84 కోట్లు కేటాయించారు.
- వర్క్‌షాప్‌లు, నిర్మాణ యూనిట్‌లలో భాగంగా విశాఖలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్‌కు రూ.20 లక్షలు, షెడ్ ఎక్స్‌టెన్షన్‌కు, ఇతర సదుపాయాలకు రూ.1.10 కోట్లు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా క్వార్టర్స్ ఆధునికీరణ, మరమ్మతులకు రూ. 15లక్షలు కేటాయించారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు...

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్, కొత్త రాయగడ డివిజన్‌కు కలిపి రూ.10 కోట్లు మాత్రం కేటాయించారు.

పంటలకు గిట్టుబాటు ధరే లక్ష్యం





వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

- దళారీ వ్యవస్థ లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాం
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- ఆరు జిల్లాల సివిల్ సప్లై అధికారులతో సమీక్ష

సాక్షి, విశాఖపట్నం : రైతు క్షేమం కోసం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దళారి వ్యవస్థ లేకుండా చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులను పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, డీఎస్‌వోలు, డీఎంలు, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీఐ అధికారులతో జీవీఎంసీ సమావేశమందిరంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 30,19, 700 టన్నులు ధాన్యాన్ని సేకరించామని, దీని మొత్తం విలువ రూ.6,165 కోట్లను వివరించారు. నిర్దిష్ట సమయంలోగా ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఆన్‌లైన్ విధానం ద్వారా నగదు కోరుకొంటున్నారని, గతంలో రూ.1200 ఉన్న మద్దతు ధర ప్రస్తుతం రూ.1530 చొప్పున నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఇందువల్ల రైతుకు ఎకరానికి సుమారు రూ.9000 లు అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్, పౌర సరఫరాల డైరెక్టర్ విజయ సునీత, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్లు కేఎస్ విశ్వనాథన్, కె.కల్పనా కుమారి, కె.మయూరి అశోక్, ఓ ఆనంద్, మల్లారపు నవీన్‌తో పాటు డీఎస్‌వోలు, డీఎంలు, ఎఫ్‌సీఐ అధికారులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలు చేపడితే ఫిర్యాదు చేయండి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధిలో ఎలాంటి అనధికార నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబరు 8187897569కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యవచ్చని జీవీఎంసీ పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్‌కుమార్ తెలిపారు. ప్రణాళికా విభాగం స్పందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్పందనకు జోన్–2 నుంచి ఒకటి, జోన్–3 నుంచి ఏడు, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి మూడు, జోన్–6 నుంచి రెండు, జోన్–8 నుంచి రెండు ఫిర్యాదులు వచ్చాయి.

విదేశీ విద్యా దీవెన ఓ వరం



విద్యార్థినికి చెక్ అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 11 మంది విద్యార్థులకు ప్రయోజనం
- రూ.1,16,78,756 ఆర్థిక సాయం

విశాఖ విద్య: విదేశాల్లో చదువుకోవాలనే నిరుపేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఓ వరం లాంటిదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో పథకాన్ని ప్రారంభించగా, విశాఖ పట్నం జిల్లాకు చెందిన 16 మంది విద్యార్థుల్లో తొలి విడతగా 11 మందికి రూ. 1,16,78,756లు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ బడుగు, బలహీన , వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేసేలా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, నగరాల చైర్ పర్సన్ పిల్లా సుజాత, ఫిషరీస్ చైర్మన్ కోలా గురువులు, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, జిల్లా అల్ప సంఖ్యాకుల సంక్షేమ అధికారి ఎంఏ రహీమ్ వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం మరువలేనిది



మాంచెస్టర్ యూనివర్సిటీలో మాస్టర్ సీటు వచ్చింది. ఇందుకోసం కోట్లలో ఖర్చు అవుతుందని తెలిసి, విదేశాలకు వెళ్లలేనేమోనని ఆందోళన చెందా. తనలాంటి వారికి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఉందని తెలిసి, దరఖాస్తు చేసుకున్నా.. ప్రభుత్వం సాయం అందించడంతో విదేశాల్లో మాస్టర్ చదువుకోవాలనే నా కోరిక నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– గోడి నిహారిక, లంకెలపాలెం

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత ఏయూ



ట్రోఫీని గెలుచుకున్న ఏయూ జట్టు

దొండపర్తి: తరుణ్ మెమోరియల్ పేరుతో శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. త్రీ ఆన్ త్రీ ప్రకారం జరిగిన ఈ టోర్నీలో మొత్తం 24 టీంలు పాల్గొన్నాయి. విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్, రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ టీ.ఎస్.ఆర్.ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మొహంతి ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ టోర్నీలో ఆంధ్రా యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. విశాఖ పోలీస్ బాయ్స్ జట్టు రన్నరప్ సాధించింది. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అసోసియేషన్ కోశాధికారి పరశురాం, ఏసీపీ(ఏఆర్) రాఘవేంద్ర, సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీ-20 సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, అధికారులు

సాక్షి, విశాఖపట్నం : నగరంలో మార్చి 28,29, 30 తేదీల్లో నిర్వహించనున్న జీ –20 సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హోటల్ రాడిసన్ బ్లూలో జీ–20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లని జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లికార్జునతో కలిసి ఆమె సమీక్షించారు. హోటల్‌లో ఉన్న సౌకర్యాలను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో గల పర్యాటక ప్రాంతాల వివరాలను జిల్లా పర్యాటక శాఖ అధికారులు వివరించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నేర నియంత్రణ

- భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై వారి సలహాలు, సూచనలు తీసుకుంటాం
- డయల్ యువర్ కమిషనర్‌కు మంచి స్పందన
- తొలిసారి నిర్వహించిన కార్యక్రమానికి 20 కాల్స్
- వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



కాలర్‌తో మాట్లాడుతూ ఫిర్యాదు నమోదు చేసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

డయల్ యువర్ సీపీ
0891-2523408

సీపీ వాట్సాప్
9493336633

దొండపర్తి (విశాఖ దక్షిణ): నగరంలో నేర నియంత్రణకు ప్రజల సహకారం కూడా అవసరమని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రత విషయంలో అందరి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని మెరుగైన పోలీసింగ్ చేపడతామని స్పష్టం చేశారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.

డయల్ యువర్ కమిషనర్‌కు 20 కాల్స్

ఈ కార్యక్రమానికి 20 మంది కాల్స్ చేసి తమ సమస్యలు చెప్పుకున్నారు. ట్రాఫిక్ సంబంధిత విషయాలపై పలు సలహాలు, సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ప్రతి కాలర్‌తోను స్వయంగా మాట్లాడి వారి సమస్యలను నోట్ చేసుకున్నారు. వాటిని వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే బాధితుల సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో ప్రధానంగా మహిళా వేధింపులపై ఇద్దరు, సివిల్ వివాదాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేయడం ఇలా పలు సమస్యలకు సంబంధించి కాల్స్ వచ్చాయి. అలాగే మద్దిలపాలెం ప్రాంతంలో పార్కింగ్, బీఆర్‌టీఎస్ రోడ్డులో రోడ్డు ప్రమాదాలు, స్పీడ్ బ్రేకర్ల ఇబ్బందులను కొంత మంది సీపీ దృష్టికి తీసుకువచ్చారు. పెందుర్తి నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని, దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని అంబులెన్సుల్లో తీసుకువెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఇప్పటికే అవసరంలేని ప్రాంతాల్లో ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. అయితే జంక్షన్లు, మలుపులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రం స్పీడ్ బ్రేకర్లు అవసరమన్నారు.

నగరంలో మెరుగైన పోలీసింగ్

నగరంలో ప్రజల భద్రత, నేర నియంత్రణకు మెరుగైన పోలీసింగ్ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. అలాగే ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. స్టేషన్లలోనే కాకుండా ప్రతి సోమవారం స్పందన ద్వారా అయినా, అలాగే సీపీ వాట్సాప్ (9493336633) కంప్లెయింట్ ద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదే విధంగా ప్రతి నెలా మొదటి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో ప్రజలు డయల్ యువర్ కమిషనర్‌కు నేరుగా 0891-2523408 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు, సమస్యలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు.

ఒకవైపు ఫిర్యాదుల పరిష్కారంపైనే కాకుండా భద్రత, నేర, ట్రాఫిక్ నియంత్రణపై ప్రజల సలహాలు, సూచనలు సైతం స్వీకరించి తదనుగుణంగా మెరుగైన పోలీసింగ్ చేపడతామని స్పష్టం చేశారు. తొలిసారి నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (క్రైం) జి.నాగన్న, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీ (ఎస్‌బీ) డి.గంగాధరం, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సాగరంతో విశ్వనాథ సంగమం

- పలు చిత్రాలను విశాఖలో చిత్రీకరించిన కళా తపస్వి
- సన్మానాలు, సత్కారాలతో ఆయన్ని గౌరవించిన కళాభిమానులు

కొమ్మాది/మద్దిలపాలెం: నటుడు, దర్శకుడు, రచయిత కళాతపస్వి కె.విశ్వనాథ్ జ్ఞాపకాలు విశాఖ ప్రజల మదిలో ఎప్పటికీ పదిలం. విశాఖలో ఆయన చిత్రీకరించిన ఎన్నో సినిమాలు మంచి విజయం సాధించాయి. విశాఖపై మక్కువతో అవకాశం ఉన్నంత వరకు యారాడ నుంచి భీమిలి బీచ్ వరకు ఎన్నో చిత్రాలను ఆయన తెరకెక్కించారు. మత్స్యకారుల జీవన విధానం ఉట్టిపడేలా తెరకెక్కించిన శుభసంకల్పం సినిమా ఓ అద్భుతం. భీమిలి తోటవీధిలో మత్స్యకారుల నివాసాల మధ్య కమల్‌హాసన్, ఆమని, ప్రియారామన్‌లకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను విశ్వనాథ్ చిత్రీకరించారు. చలం శారీస్ ఆశ్రమంలో రాజశేఖర్, సుమలత నటించిన శృతిలయలు సినిమా షూటింగ్ జరిగింది. స్వర్ణకమలం, స్వాతిముత్యం వంటి సూపర్ హిట్ సినిమాలు వైజాగ్ తాజ్ హోటల్, అప్పికొండ, ఆర్.కె బీచ్, భీమిలి బీచ్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్నాయి. ఆయన చివరిగా దర్శకత్వం వహించిన శుభప్రదం సినిమాలోని పలు సన్నివేశాలు విశాఖ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. విశాఖతో ఆయనకు విడదీయలేని బంధం ఉందని.. ఇక్కడ వాతావరణం మరెక్కడా ఉండదని చెప్పేవారని పలువురు సీనియర్ నటులు గుర్తు చేసుకున్నారు.



అష్టలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన కళాతపస్వి విశ్వనాథ్(ఫైల్)

అష్టలక్ష్మి ఆలయ దర్శనం

కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి ఆలయంలోని లక్ష్మీ నారాయణ స్వామిని కె.విశ్వనాథ్ 2015 నుంచి 2017 వరకు వరసగా దర్శించుకున్నారని ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. 2010లో శుభప్రదం ఆడియో ఫంక్షన్ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2012లో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో యాక్మీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గొల్లపూడి మారుతీరావు జన్మదిన వేడుకలకు కె.విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2012లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. 2017 జూన్ 28న కళాభారతిలో ఆయనకు ఘన సన్మానం జరిగింది.



నివాళులర్పిస్తున్న ఏపీ మా ప్రతినిధులు

పలువురి సంతాపం

తెలుగు చిత్ర పరిశ్రమ ఖ్యాతిని దశదిశలా చాటిన కళాతపస్వి కె.విశ్వనాథం మరణం కళా జగతికి తీరని లోటని ఘంటసాల కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమల రావు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతిధులు కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు సంస్కృతి సంప్రదాయానికి పెద్ద పీట వేసిన దర్శక దిగ్గజాన్ని చిత్ర పరిశ్రమ కోల్పోయిందని సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. త్వరలో కె.విశ్వనాథ్ చిత్రాలతో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు.

విశ్వనాథ్, సాగర్‌కు ఘన నివాళులు

సీతమ్మధార: ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్, సాగర్‌ల మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(ఏపీ మా) గౌరవ అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఏపీ మా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దర్శకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమ ఉన్నంత వరకు విశ్వనాథ్, సాగర్ పేర్లు చిరస్థాయిగా ఉంటాయన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణ కిశోర్, వై.అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శులు సీహెచ్ రమేష్ యాదవ్, నాంచారయ్య, పూతి వెంకటరెడ్డి, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహా నటుడిని కోల్పోయాం



తెలుగు సినిమాకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన మహా దర్శకుడు కె.విశ్వనాథ్. అలాంటి గొప్ప దర్శకుడితో కలసి పనిచేయడం నా పూర్వ జన్మ పుణ్యం. సినీ పరిశ్రమ ఓ మహా నటుడిని కోల్పోయింది.
– రవి ప్రకాష్, నటుడు

తరతరాలకు ఒక గ్రంథం



కళాతపస్వి కె.విశ్వనాథ్ సినిమాలు తరతరాలకు ఒక గ్రంథంలా నిలుస్తాయి. సంగీతాన్ని, నాటి సమాజ స్వభావాన్ని అవలీలగా పండించి సినిమా తీయడంలో మహా యోగి. నేడు ఆ మహా తపస్విని కోల్పోవడం కళా జగతికి తీరని లోటు.
–ప్రసన్నకుమార్, నటుడు

సాహిత్యంలో పట్టుతోనే చట్టంపై అవగాహన

కర్ణాటక లా కమిషన్ చైర్మన్ ఎస్ఆర్ బన్నూరుమత్

సబ్బవరం: చట్టంలోని మెళకువలు, చిక్కులను తెలుసుకునేందుకు సాహిత్యంపై అవగాహన అవసరమని కర్ణాటక లా కమిషన్ చైర్మన్, కేరళ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్ఆర్ బన్నూరుమత్ అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ది ఇంటర్ ఫేస్ ఆఫ్ లా అండ్ లిటరేచర్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. సెంటర్ ఫర్ లా, లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలను అర్థం చేసుకోవడంలో భాష, సాహిత్యం పోషించే పాత్రను వివరించారు. సాహిత్యంలోని మెళకువలను తెలుసుకునేందుకు తరచూ ప్రయత్నించడం వల్ల మరింత పట్టుసాధించవచ్చన్నారు. జస్టిస్ కృష్ణయ్యర్ నిర్ణయాలు, తీర్పులను పరిశీలిస్తే భాష, సాహిత్యం ఉపయోగించడంలో నైపుణ్యత తెలుస్తుందన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో లాంగ్వేజెస్ అండ్ లిటరేచర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినందుకు వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్‌ను అభినందించారు. ఉపకులపతి మాట్లాడుతూ సాహిత్యం, చట్టాల మధ్య ఉన్న ఈ అంతర్గత సంబంధాన్ని బహిర్గతం చేయడంలో ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. చట్టం, భాష, సాహిత్యాల మధ్య సంబంధాన్ని పరిశోధించి అధ్యయనం చేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. ఆచార్య ముఖేష్ శ్రీవాస్తవ్, ఆచార్య టి. విశ్వనాథరావు, ఆచార్య కె.రమేష్, ఆచార్య ఆర్ఎన్ హనుమంతు, డాక్టర్ పి.ఊర్మిళ అతుల్ తదితరులు ప్రసంగించారు. రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ కె.మధుసూదనరావు, సెంటర్ ఫర్ లా, లాంగ్వేజ్, సాహిత్యం ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ బరిణికాన నరసింగరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ఆందోళన వద్దు



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఆస్పత్రి సీఈవో రామచంద్ర

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): క్యాన్సర్ ప్రాణాంతకం అయినప్పటికీ.. సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చని అపోలో ఆస్పత్రి సీఈవో రామచంద్ర అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సాగరతీరంలో క్యాన్సర్‌పై అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన లేక ఏర్పడే భయం రోగిని కుంగదీస్తుందన్నారు. కాబట్టి క్యాన్సర్‌కు చికిత్స ఎంత అవసరమో.. క్యాన్సర్ పట్ల అవగాహన కూడా అంతే అవసరమన్నారు. అపోలో మార్కెటింగ్ హెడ్ రవిశంకర్, ఏబీ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ స్వరూప్, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.



బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్ క్యాంపస్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో బీఎఫ్ఎస్ఐ–బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కోర్సు నందు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 30 ఏళ్ల వయో పరిమితి కలిగిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు.45 రోజుల ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఇంటర్‌లో బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 12 రకాల పారామెడికల్ కోర్సుల్లో, ఇంటర్ (ఏదైనా గ్రూపు) పాసైన విద్యార్థులకు 10 రకాల డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెప్పారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు ఐదు రకాల పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 72079 53919, 76708 58199, 76809 45357లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



విఠల్ రావు (ఫైల్)

గోపాలపట్నం: అతి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో కానిస్టేబుల్ కంచరాన విఠల్‌రావు(35) ఘటనాస్థలంలోనే మృతి చెందారు. ఎయిర్‌పోర్టు పోలీసుల తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్లపల్లికి చెందిన విఠల్‌రావు కానిస్టేబుల్. ప్రస్తుతం మాధవధార కళింగనగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అతని భార్య పురుడు కోసం పుట్టింటికి వెళ్లారు. గాజువాక ట్రాఫిక్ విభాగంలో ఆయనకు పోస్టింగ్ కాగా.. అనారోగ్య కారణాలతో కంట్రోల్ రూమ్ నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రాత్రి పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు పూర్తి చేసి ఇంటికి వచ్చారు. శుక్రవారం నగరంలో పలు పనులు నిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు డీమార్ట్ వద్ద హైవే దాటుతున్నారు. ఈ క్రమంలో ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు అతివేగంగా వెళ్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని శరీరం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. విఠల్‌రావు మృతితో అతని కుటుంబంతో విషాదం నిండుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు కానిస్టేబుల్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్న సన్యాసిరావు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.